
సాక్షి సిద్దిపేట

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దూల్మిట్ట మండలం బెక్కల్‌లోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జరగనున్నాయి. వివరాలు 8లో ▸



పాత పంటల జాతర

పాత పంటల జాతర మంగళవారం ఝరాసంగం మండల పరిధి మాచ్నూర్ శివారులో ముగిసింది. వివరాలు 8లో ▸

మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

చిన్నకోడూరు(సిద్దిపేట): సీసీఐ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడిన చిన్నకోడూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి పరమేశ్వర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్ రీజియన్ జేడీఎం ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. మార్కెట్ జారీ చేసిన టీఆర్‌లతో తేడాలు ఉన్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు కార్యదర్శిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రంగరాజన్‌ను పరామర్శించిన బ్రాహ్మణులు



రంగరాజన్‌తో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను గజ్వేల్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్చకులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం నిందితులను పట్టుకొని శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు దేశపతి శంకరశర్మ, రవీందర్‌రావు, విశాలకృష్ణమూర్తి శర్మ, నందబాలశర్మ, సాయికృష్ణశర్మ, శ్యాంప్రసాద్‌శర్మ, రఘు మురళీమోహనశర్మ, విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్



రిజర్వాయర్‌లోకి పంపింగ్ అవుతున్న నీరు

కొమురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్‌ను అధికారులు ప్రారంభించారు. జనగామతో పాటు సిద్దిపేట నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు సాగు నీరు అందించే తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. దీంతో మంగళవారం అధికారులు బొమ్మకూరు రిజర్వాయర్‌నుంచి పంపింగ్ చేపట్టారు. దీంతో పరిసర గ్రామాల రైతులు హర్షం వక్తం చేస్తున్నారు. గతంలో రిజర్వాయర్ నీటితో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు దూల్మిట్ట, బచ్చన్నపేట మండలాల్లోని చెరువులను నింపేవారు. మారిన రాజకీయ పరిణామాలతో ఈప్రాంతంలోని చెరువులు నిండకముందే భువనగిరి నియోజకవర్గానికి కొంత మంది నాయకులు నీరు తరలించడంతో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారైనా ఈప్రాంత చెరువులు పూర్తిగా నింపేందుకు అధికారులు, రాజకీయ నాయకులు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌ఓ పాల్వాన్ కుమార్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాన్ కుమార్

దుబ్బాకటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ పాల్వాన్ కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు: సీపీ

సిద్దిపేటకమాన్: అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, డంపింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని సీపీ అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100కు సమాచారం అందించాలన్నారు.

బాబోయ్.. బర్డ్ ఫ్లూ!

బర్డ్ ఫ్లూ భయం జిల్లా వాసులను వణికిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక పౌల్ట్రీ ఫామ్‌లు ఉన్న జిల్లాగా సిద్దిపేట పేరుగాంచింది. జిల్లాలో 60కిపైగా లేయర్, 175పైగా బాయిలర్ పౌల్ట్రీ ఫామ్‌లు ఉన్నాయి. వాటిల్లో రోజుకు 50 లక్షల వరకు గుడ్లు ఉత్పత్తి అవుతండగా, 92లక్షల వరకు కోళ్లు ఉన్నాయి. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వివిధ కారణాల చేత కోళ్లు మృత్యువాత పడుతుండటంతో జిల్లాలోని ఫౌల్ట్రీ ఫామ్‌ల నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.



బాయిలర్ (చికెన్) పౌల్ట్రీ ఫామ్‌లు:	లేయర్(గుడ్లు) పౌల్ట్రీ ఫామ్‌లు:	సుమారు కోళ్ల సంఖ్య:
175	60	92 లక్షలు

చికెన్ ప్రియుల్లో భయం భయం

- వాడకం తగ్గిస్తున్న ప్రజలు
- ఆందోళనలో పౌల్ట్రీ నిర్వాహకులు
- తగ్గిన విక్రయాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో పౌల్ట్రీ ఫామ్స్ అతిపెద్ద ఉపాధి కల్పన పరిశ్రమగా రూపాంతరం చెందింది. ఇక్కడి నుంచి కోడిగుడ్లు, కోళ్లు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు సరఫరా అవుతుంటాయి. దీంతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. ఇదిలా ఉంటే బర్డ్ ఫ్లూ వార్తల నేపథ్యంలో జిల్లా వాసులు చికెన్, కోడిగుడ్లు అంటేనే భయపడుతున్నారు. చికెన్ తినడం వల్ల బర్డ్ ఫ్లూ వ్యాపిస్తుందనే భయంతో వారంలో నాలుగు రోజులు తినే వారు సైతం చికెన్ వైపు చూడటంలేదు. దీంతో వ్యాపారం మందగించడంతో చికెన్ సెంటర్ల నిర్వాహకులు, కోడిగుడ్ల వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.

సోషల్ మీడియాలో హల్‌చల్

బర్డ్‌ఫ్లూ విస్తృతంగా వ్యాప్తిస్తోందని, చికెన్, కోడిగుడ్లు తినవద్దని రాష్ట్ర స్థాయి అధికారులు ప్రకటనలు విడుదల చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో చికెన్ ప్రియులు మరింత ఆందోళన చెందుతున్నారు.

వారం రోజులుగా దూరం..



వారంలో కనీసం రెండు, మూడు రోజులు చికెన్, కోడిగుడ్లు వినియోగించేవాళ్లం. బర్డ్ ఫ్లూ విస్తరిస్తుందనే నేపథ్యంలో వారం రోజులుగా పూర్తిగా మానివేశాం. మా బంధువులు కూడా తినడం లేదు. కొన్ని రోజులు మానివేయడమే మంచిదనే నిర్ణయానికి వచ్చాం.

–గట్టయ్య, చికెన్ ప్రియుడు, సిద్దిపేట


భయం వద్దు..



జిల్లాలో ఎలాంటి బర్డ్‌ఫ్లూ వ్యాప్తి లేదు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసంరం లేదు. నిశ్చితంగా చికెన్, కోడిగుడ్లను వినియోగించవచ్చు. పలు పౌల్ట్రీలను, కోళ్లను పరిశీలించాం. ఎక్కడా బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు లేవు. కనుక ఎవరూ భయపడవద్దు.

– వెంకట్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పోటీకి సై..



ఉద్యమ, రాజకీయ చైతన్యం కలిగిన మెతుకుసీమ తనదైన ప్రత్యేకతను చాటుతోంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఉమ్మడి జిల్లా నుంచి 27 మంది నామినేషన్లు వేశారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారంతో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. నామినేషన్లను కరీంనగర్‌లో స్వీకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 70,713 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 7,249 మంది ఉన్నారు.

ఆసక్తికరంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉమ్మడి మెదక్ నుంచి 27 మంది నామినేషన్లు
- పట్టభద్రుల ఎమ్మెల్సీకి 22 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఐదుగురు
- రేపటి వరకు ఉపసంహరణ గడువు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 77వేల మంది ఓటర్లు

సాక్షి, సిద్దిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వంద మంది నామినేషన్లు వేయగా అందులో ఉమ్మడి మెదక్ నుంచి 22 మంది ఉన్నారు. అందులో సంగారెడ్డి జిల్లా నుంచి 11 మంది, సిద్దిపేట నుంచి 9, మెదక్ నుంచి ఇద్దరు ఉన్నారు. బీజేపీ నుంచి అంజిరెడ్డి (రామచంద్రాపురం, సంగారెడ్డి), ఇండిపెండెంట్లుగా పిడిశెట్టి రాజు (కోహెడ, సిద్దిపేట), చంద్రశేఖర్ (కంది, సంగారెడ్డి), దొడ్ల వెంకటేశం (సదాశివపేట్, సంగారెడ్డి), ఎస్ చంద్రశేఖర్ (మెదక్), దేవునూరి రవీందర్ (భరత్‌నగర్, సిద్దిపేట), మంద జ్యోతి (శ్రీనివాసనగర్, సిద్దిపేట), గుమ్మడి శ్రీశైలం (పెద్దలింగారెడ్డిపల్లి, సిద్దిపేట), సంజీవులు (కంది, సంగారెడ్డి), బెజుగం వెంకటేష్ (హౌసింగ్‌బోర్డు కాలనీ, సిద్దిపేట) నామినేషన్లు వేశారు. అలాగే వెంకటేశ్వర్లు (పటాన్‌చెరు, సంగారెడ్డి), సాయిబాబా (తూప్రాన్, మెదక్), మచ్చ శ్రీనివాస్ (దుబ్బాక, సిద్దిపేట), ఎన్.యాదగిరి (ఆర్సీపురం, సంగారెడ్డి), గిరిధర్ (మంజీరానగర్, సంగారెడ్డి), ఇంద్రాగౌడ్ (మర్కూక్, సిద్దిపేట), శంకర్ రావు (పటాన్‌చెరు, సంగారెడ్డి), సత్యనారాయణగౌడ్ (సదాశివపేట, సంగారెడ్డి), లక్ష్మీప్రసన్న (పటాన్‌చెరు, సంగారెడ్డి), నరేందర్ రెడ్డి (జహీరాబాద్, సంగారెడ్డి), ఆంజనేయులు (నంగనూరు, సిద్దిపేట), పోచబోయిన శ్రీహరి యాదవ్ (చిన్నకోడూరు, సిద్దిపేట) నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి..

ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఐదుగురు నామినేషన్లు వేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి(చిన్న కోడూరు, సిద్దిపేట), పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్ రెడ్డి (ప్రశాంత్‌నగర్, సిద్దిపేట) మామిడి సుధాకర్ రెడ్డి (టేక్మాల్, మెదక్), అశోక్ కుమార్ (కొండాపూర్, సంగారెడ్డి), జగ్గు మల్లారెడ్డి (మోయిన్‌పూర, సిద్దిపేట) నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. ఇదిలా ఉంటే నామినేషన్లు వేసిన వారిలో ఎనిమిది మందివి తిరస్కరణకు గురయ్యాయి.

ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో..

ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. గ్రూపులుగా డిన్నర్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు. తనను గెలిపిస్తే విద్యా అభివృద్ధికి, నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీలు గుప్పిస్తున్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు గురువారం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. దీంతో ఎవరు పోటీలో ఉంటారో తేలనుంది. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న కౌంటింగ్ చేపట్టనున్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థినులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, లైబ్రరీని పరిశీలించి కళాశాల వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫస్టియర్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్‌కు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థినులు కంప్యూటర్ విద్యను శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ కళాశాల ఆవరణను కలెక్టర్‌కు చూపించారు. మొత్తం 325 మంది విద్యార్థినులు చదువుతున్నారని, తరగతి గదులు సరిపోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ కళాశాల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

ఎఫ్‌పీఓలను బలోపేతం చేయండి

సిద్దిపేటఅర్బన్: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రసిద్ధ, ప్రహర్ష ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లను బలోపేతం చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న క్రిషి కల్ప అధికారులతో, ఎఫ్‌పీఓల సీఈఓ, డైరెక్టర్‌లతో మంగళవారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా క్రిషి కల్ప సీఈఓ పాటిల్ ఎఫ్‌పీఓలు బలోపేతం చేయడానికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సాహం అందించాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్ విద్యార్థులకు మార్కెటింగ్ స్కిల్స్ నేర్పించి వాటిపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని క్రిషి కల్ప అధికారులకు సూచించారు. సమావేశంలో డీఏఓ రాధిక, డీహెచ్‌ఓ సువర్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్
- వార్డు ప్రత్యేక అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్

సిద్దిపేటజోన్: వార్డు ప్రత్యేక అధికారులుగా బాధ్యతాయుతంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నీటి సరఫరా, విద్యుత్ దీపాల సమస్యలు ఉంటే సంబంధించిన సిబ్బందికి తెలుపాలని సూచించారు. వార్డుల్లో నూతన ఇంటి నిర్మాణాలు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని, నిబంధనలు ఉల్లంగిస్తే టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు తాగునీరు పొదుపుగా వాడేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆస్తి, నల్లా పన్నులు వసూలు వంద శాతం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

నంగునూరు(సిద్దిపేట): పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంగునూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పెండింగ్ పనులపై ఆరా తీశారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ సరిత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ లింగం, జయసూర్య పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో స్పెషల్ అధికారి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని అధికారులకు సూచించారు. శానిటేషన్, వాటర్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష కార్యక్రమానికి హుస్నాబాద్ మున్సిపాలిటీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మేనేజర్ భూమానందం, ఏఈ మహేష్, జేఏఓ ఆరతి, ఆర్‌ఐ కనకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

హుస్నాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మంగళవారం ఐఓసీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ తరగతులను డీపీఓ దేవకీదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

13 నుంచి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

సిద్దిపేటరూరల్: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట డివిజన్‌కు సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులు 13, 14, 15 తేదీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని పీఓలు 13, 14 తేదీలలో గజ్వేల్ ఐఓసీలో, హుస్నాబాద్ డివిజన్ పీఓలు 13, 14 తేదీలలో ఐఓసీలో జరిగే శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాల్సిందే

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు



కాలువ వద్ద రైతులతో సెల్ఫీ దిగుతున్న హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసివ్వడంతో పాటు దేవుళ్ల మీద ఒట్టు పెట్టుకున్న రేవంత్‌రెడ్డి హామీలను నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నంగునూరు మండలం కోనాయిపల్లిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. కోనాయిపల్లిలో తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్ వేంకటేశ్వరుని అనుగ్రహంతో రాష్ట్రాన్ని సాధించారన్నారు. రాబోయే రోజుల్లో వెంకన్న ఆశీస్సులతో రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలకు డబ్బులు ఇవ్వడంలేదని, గత ప్రభుత్వంలో మంజూరైన నిర్మాణాలకు టెండర్లు పిలవకుండా ఆలయాలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

కాలువల పరిశీలన..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి సలెంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువలను మంగళవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగు నీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాలువ పక్కన ఆగి రైతులతో సెల్ఫీ దిగారు. రైతులతో ముచ్చటించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ సమస్యలు, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు వివరించారు. తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు తదితరులు ఉన్నారు.



తలపడుతున్న మల్లయోధులు, హాజరైన ప్రజలు

కుస్తీ మే సవాల్

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల కేంద్రంలో కుస్తీ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఈ పోటీలను నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులు, ఈలల మధ్య పహిల్‌వాన్లు కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి.

– న్యాల్‌కల్(జహీరాబాద్)

క్లుప్తంగా

సైన్స్ సెమినార్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు

గజ్వేల్: రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు చిన్న బ్రహ్మయ్య, ములుగు మండలం సింగన్నగూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన క్రాంతికుమారి ఎంపికయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఎస్‌సీఈఆర్‌టీ(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్) ఆధ్వర్యంలో 28న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు తమ ప్రదర్శన ఇవ్వనున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు అభినందించారు.

ఇసుక డంప్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ శివారులో సోమవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు దాడి చేసి అక్రమంగా డంప్ చేసిన 40 టన్నుల ఇసుకను పట్టుకున్నట్లు ఎస్‌ఐ క్రిష్టారెడ్డి ఇసుకను తీస్తున్న జేసీబీని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడంతోపాటు యజమాని శ్రీనివాస్, డ్రైవర్ రాజేశ్ పైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలోని వైన్స్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మాసాయిపేట వైన్స్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. మృతుడు చిన్న శంకరంపేట మండలం దర్పల్లి గ్రామంలో నివసిస్తున్న శంకర్(50)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పూర్తి వివరాల నిమిత్తం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన పాత పంటల జాతర


జాతరలో ఎడ్లబండ్ల ఊరేగింపు


నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

- 35 రోజులపాటు నిర్వహణ
- చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ర్యాలీ
- ఆకట్టుకున్న మహిళా రైతుల నృత్యాలు

ఝరాసంగం(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల పరిధిలోని వడ్డీ గ్రామంలో ప్రారంభమైన 25వ పాత పంటల జాతర మంగళవారం ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో ముగిసింది. డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత నెల 14న ప్రారంభమై సుమారు 35 రోజులపాటు నియోజకవర్గంలోని 25 గ్రామాల్లో పర్యటిస్తూ చిరుధాన్యాల సాగు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ పాత పంటల జాతరను నిర్వహించారు. ముగింపు సందర్భంగా మాచ్నూర్ గ్రామం నుంచి డీడీఎస్ పచ్చ సాలె వరకు చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను ర్యాలీగా నిర్వహించారు. మహిళా రైతులు డప్పు చప్పుళ్ల మధ్య కోలాటం ఆడుతూ, నత్యాలు చేస్తూ చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డి, గంగాధర్, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరత్ బాబు, ఎన్‌బీజీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ సోమ మర్ల, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, ఎస్సై నరేశ్, డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణి రావుతోపాటు ప్రముఖులు హాజరయ్యారు. జాతర ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాలను సాగు చేస్తూ భూసారాన్ని కాపాడుతున్న జీవవైవిధ్య సంరక్షకులు చౌహాన్ ధర్మీబాయి, యశోద, శాంతి భాయ్ చౌహాన్, సీతాబాయి చౌహాన్, బైండ్ల సుజాత, మొలిగిరి మంజులమ్మ, తుల్జమ్మతోపాటు జీవవైద్య పంటల సంరక్షణపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందించారు.

రూ.వెయ్యి బోనస్‌కు కృషి

చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రూ.1000లు అందించే విధంగా కృషి చేస్తామని, అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాములునాయక్, భవాని రెడ్డి, గంగాధర్ వెల్లడించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌బాబు మాట్లాడుతూ... ప్రాంతీయ విత్తన రకాలను కాపాడటంలో సంఘం సభ్యుల పాత్ర కీలకమైందన్నారు. నేడు పెద్ద కంపెనీల దృష్టి పడిందని, మీరు కాపాడిన విత్తనాలను వాళ్ల చేతిలో పడకుండా ఉండేందుకు రిజిష్టర్ చేయాల్సి ఉందని సూచించారు.

మెమెంటోలు, ఫ్రేమ్స్ అందిస్తాం

దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులతో త్వరలో నిర్వహించే సమావేశాలకు ఇక్కడ మెమెంటోలు, ఫ్రేమ్స్ అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులు వెల్లడించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ తయారు చేసిన మెమెంటో ఎంతో ఆకర్షణీయంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

భరోసా సెంటర్ సందర్శన


భరోసా సెంటర్ ను సందర్శించిన బెంగళూరు సిటీ పోలీస్ బృందం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను బెంగళూరు సిటీ పోలీస్ బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్షమా మిశ్రాతో పాటు బృందం సభ్యులు సౌమ్య, ఈశ్వరి, సుశ్మాలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు కేంద్ర కార్యకలాపాలు, బాధితుల సహాయక వ్యవస్థ, న్యాయపరమైన చర్యలు గురించి అధ్యయనం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చిన్నారులతో మాట్లాడుతున్న హేమభార్గవి

నర్సాపూర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి సూచించారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని తూజల్‌పూర్, శివ్వంపేట మండలంలోని గోమారం, నవపేట, బిక్య తండా, పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింత మహిళలకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలు పిల్లల ఆరోగ్యాన్ని, బరువును పరీక్షిస్తూ భోజనాన్ని అందించాలన్నారు.

వాగులో మహిళ మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హన్మంత్

న్యాల్‌కల్(జహీరాబాద్): గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని హద్నూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ కథనం మేరకు... మంగళవారం ఉదయం పొలానికి వెళ్తున్న రైతులు గ్రామ శివారులోని జల వాగులో మహిళ మృతదేహాన్ని చూశారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి సీఐ హన్మంత్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతురాలు నల్లని రంగు స్వెట్టర్, పసుపు రంగు పట్టు చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు నెలల కిందట వాగులో కొట్టుకుని వచ్చి ఉండవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

ఇస్నాపూర్‌లో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీ చెందిన ప్రసాద్ (26) సోమవారం ఇంటి నుంచి స్కూటీ తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా మంగళవారం గ్రామ శివారులోని పెద్ద చెరువు గట్టుపై స్కూటీ, చెప్పులు కనిపించాయి. గజఈతగాళ్ల సాయంతో చెరువులో వెతకగా ప్రసాద్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రసాద్ ఆర్థిక ఇబ్బందులు లేదా మరేదైనా కారణంతో ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో ఉరేసుకొని బలవన్మరణం

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ధర్మాసాగర్‌లో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. ధర్మాసాగర్ గ్రామానికి చెందిన పెద్ది నాగరాజు(35) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గతేడాది ఇంటి నిర్మాణం కోసం తెలిసిన వారి వద్ద రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక నిత్యం బాధపడుతుండేవాడు. సోమవారం భార్యాపిల్లలతో కౌడిపల్లిలో మల్లన్న జాతరకు వెళ్లాడు. అక్కడి నుంచి ముందుగా నాగరాజు ఇంటికొచ్చాడు. కొద్దిసేపటికి భార్య ఇంటికి రాగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి జగిత్యాల వాసి..

కొండపాక(గజ్వేల్): పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా పుడూర్‌కు చెందిన గట్ల మల్లయ్య (52) కుటుంబీకులు కొన్నేళ్ల కిందట బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. దర్జీ పనిచేస్తూ మద్యానికి బానిసకావడంతో అనారోగ్యానికి గురికావడంతో చనిపోతానంటూ పలుమార్లు కుటుంబీకులను బెదిరించాడు. 10న సాయంత్రం సొంతూరు పూడూరుకు వెళ్తున్నానంటూ చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి అతడి వద్ద ఉన్న ఫోన్ ద్వారా కుటుంబీకులను సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటలోకి దూసుకెళ్లిన టిప్పర్


బోల్తా పడ్డ టిప్పర్

జిన్నారం (పటాన్‌చెరు): కుంటలోకి టిప్పర్ దూసుకెళ్లిన ఘటన బొల్లారం పారిశ్రామిక వాడలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పారిశ్రామిక వాడలోని ఆసానికుంట సమీపంలో టిప్పర్ డ్రైవర్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న ఆసానికుంటలోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

బైండోవర్ ఉల్లంఘన

మహిళకు రూ.50 వేలు జరిమానా


తహసీల్దార్ ఎదుట మహిళ

అక్కన్నపేట(హుస్నాబాద్): బైండోవర్ ఉల్లంఘనలో ఓ మహిళకు తహసీల్దార్ జరిమానా విధించారు. ఈ ఘటన మండలంలోని కుందనవానిపల్లి గ్రామంలో చోటు చేసుంది. ఎక్సైజ్ శాఖ సీఐ పవన్, ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన భానోతు సుగుణ గతంలో గుడుంబా తయారీ చేసి అమ్ముతూ పట్టుబడగా బైండోవర్ చేశారు. మరోసారి గుడుంబా అమ్ముతూ పట్టుబడింది. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు తహసీల్దార్ అనంతరెడ్డి రూ.50వేలు జరిమానా విధించారు.

ఎన్నికలు ఏవైనా బీజేపీదే గెలుపు

పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జి రాంచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి

గజ్వేల్‌రూరల్: అవినీతి, అక్రమాలతో బీఆర్‌ఎస్ నిండిపోయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడగా కార్ రేసింగ్‌లో కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కుమ్మక్కై బీజేపీపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ట్యాక్స్‌లో మినహాయింపు ప్రకటించారని, గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలలో కేంద్ర ప్రభుత్వ నిధులున్నాయని చెప్పారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 48 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చిందని, 29 రాష్ట్రాలకుగానూ మిత్రపక్షాలతో కలిపి 23 రాష్ట్రాల్లో బీజేపీ పాలన సాగిస్తోందన్నారు. త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, సాయిబాబా, రాములు, మనోహర్‌యాదవ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నిందితుడు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నంగునూరు(సిద్దిపేట): గంజాయి విక్రయం కేసులో మరో నిందితుడిని రాజగోపాల్‌పేట పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా కేరిమేరి మండలం అంతాపూర్ మధిర గ్రామం ఏసాపూర్‌కు చెందిన రవి జాదవ్ అలియాస్ సందీప్ జాదవ్ ఇటీవల పట్టుబడ్డ గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడు. మంగళవారం గంజాయి విక్రయించేందుకు జేపీ తండాకు వచ్చాడనే సమాచారంతో రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్ సిబ్బందితో కలిసి మాటు వేసి పట్టుకున్నాడు. అతడి వద్ద తనిఖీ చేయగా 359 గ్రాముల గంజాయి లభించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పిల్లలకు వైద్య సౌకర్యాలు అందజేయాలి

జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి


మొక్క నాటుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పిల్లలకు ఎప్పటికప్పుడు వైద్య సౌకర్యాలు అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చేర్యాల మనోచేతన రిహేబిలిటేషన్ సెంటర్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. హాస్టల్‌లో భోజనం నాణ్యత, వంటగది పరిసరాలను పరిశీలించారు. రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

సుమారు రూ.5.50 లక్షల ఆస్తి నష్టం

రాయికోడ్(అందోల్): అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని మాదాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. మంగలి విఠల్ భార్య రత్నమ్మ ఇంట్లో మంగళవారం పూజ చేసి దీపం వెలిగించింది. ప్రమాదవశాత్తు ఆ దీపం పక్కనే ఉన్న బట్టలకు నిప్పంటుకుంది. అనంతరం పక్కనే సామగ్రి, ట్రంక్ పెట్టెకు మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు మంటలార్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంట్లోని రూ.2.50 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం, నగలు కాలిపోయాయి. అలాగే, పక్కనే ఉన్న మంగలి అంజన్న ఇంటికి మంటలంటుకున్నాయి. అతడి ఇంట్లో రూ.50 వేల విలువ గల సామగ్రి దగ్ధమైంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- 45 రోజులపాటు దీక్షలు
- వ్యాధిగ్రస్థులకు నయమవుందని నమ్మకం
- శివరాత్రి వరకు కొనసాగనున్న ఉత్సవాలు


గుట్టపై కాకతీయులు నిర్మించిన ఆలయం


స్వామి మూలవిరాట్

మద్దూరు(హుస్నాబాద్): నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన బెక్కల్ శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దూలిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలోని రామాచల గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం క్రీ.శ 1117 కాకతీయుల రాజుల పాలనలో నిర్మించబడింది. ప్రస్తుత బెక్కల్ గ్రామం అప్పట్లో భద్రంగపురంగా పిలిచేవారని ప్రచారంలో ఉంది. గ్రహపీడితులు, అనారోగ్యం బారిన పడిన ఎంతో మంది బాధితులు ఆలయంలో 45 రోజుల పాటు దీక్షలు చేపట్టి స్వామి వారిని ఆరాధిస్తుంటారు. ఆలయానికి సమీపంలోనే పోచమ్మ దేవాలయం నిర్మించబడింది. స్వామి వారిని దర్శించుకున్న భక్తులంతా పోచమ్మ తల్లిని దర్శించుకొని పవిత్రవుతుంటారు.

ఉత్సవాల రోజు వారి కార్యక్రమాలు

మాఘ పౌర్ణమి బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు స్వామి వారి మేలుకొల్పు అనంతరం 6 గంటలకు దీక్షి కుంభంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 10 గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం బండ్ల సేవా, రాత్రి అమ్మాపురం కళాకారులతో నాటక ప్రదర్శన చేస్తారు. 13న గురువారం ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రికి అమ్మాపురం కళాకారులతో నాటక ప్రదర్శ చేస్తారు. 14న శుక్రవారం స్వామి వారికి అర్చనలు, పాలభిషేకాలు, రాత్రికి సింధు కళాకారుల నాటక ప్రదర్శన చేస్తారు. 15న ఉదయం 8 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, గోత్రనామార్చనలు, రాత్రికి సింధు కళాకరులతో నాటక ప్రదర్శ నిర్వహిస్తారు. 16న అమ్మవారి కుంకుమార్చన, అభిషేకం,అర్చనలు నిర్వహిస్తారు. 17న ఉదయం 6గంటలకు గంగస్నానం అనంతరం 11.45 కు స్వాతి నక్షత్రయుక్త అభిజిత్ లగ్నమున స్వామి కల్యాణోత్సవం, అనంతరం అన్నదానం చేస్తారు. 18న మంగళవారం రోజున ఉదయం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేస్తారు. 19న సప్తమి రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. 20,21న ఉదయం బిల్వార్చనలు రాత్రికి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 22న ఉదయం సుంకు బియ్యం సమర్పన భద్రకాళీ అమ్మవారి ఆహ్వన కార్యక్రమం, ప్రత్యేక పూజలు జరుపబడును. 23న తెల్లవారు జామున 5 గంటలకు అగ్నిగుండాల ప్రవేశం అనంతరం వీరభద్ర విజయం గెలుపు కార్యక్రమం జరుపబడును. 24న ఏకాదశ అభిషేకాలు, అర్చనలు జరుపబడును. 25న ద్వాదశ అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. 26న శివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో రామలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసి అనంతరం రాత్రికి మల్లికార్జున స్వామికి పెద్ద పట్నం, గ్రామస్తులతో బోనాల సమర్పణ చేస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బెక్కల్ శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేపడుతున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, జనగామ, హన్మకొండ, హుస్నాబాద్, చేర్యాల నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యాలను అధికారులు కల్పించారు.

– చొప్పరి మల్లేశం, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్